రైతుల పాదయాత్రకు శ్రీకారం

● సోయా పంటకు మద్ధతు ధర, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు డిమాండ్

బాసర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో బాసర మండల రైతులు పాదయాత్రకు సిద్ధమయ్యారు. బుధవారం ఉదయం 7 గంటలకు సరస్వతి అమ్మవారి ఆలయం వద్ద నుంచి పాదయాత్ర ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా మండలంలోని రైతులందరూ ఏకతాటిపైకి రావాలని సంఘం నాయకులు పిలుపునిచ్చారు. రైతులు పండించిన సోయాబీన్ తక్షణం ప్రారంభించాలనే డిమాండ్‌తో పాదయాత్ర కొనసాగనుంది. కష్టపడి పండించిన పంటకు సరైన ధర దక్కేవరకు పోరాటం కొనసాగిస్తామని రైతులన్నారు.

సహకారమేదీ!

- కొత్త ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఏర్పాటు ఎప్పుడు ?
- 20 పీఏసీఎస్ ప్రతిపాదనలపై పట్టింపు కరువు
- సహకార రుణాల కోసం రైతులకు తిప్పలు
- ప్రతిఏటా ఇవే అవస్థలు
- సర్కారు స్పందించాలంటున్న అన్నదాతలు

నిర్మల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త మండలాల్లో అదనంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకు సంబంధిత శాఖ అధికారులు రూపొందించిన ప్రతిపాదనలపై సర్కారుకు పట్టింపు కరువైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 20 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఏడాది క్రితం ప్రతిపాదనలు రూపొందించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటైన కొత్త మండలాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలన్న సర్కారు నిర్ణయం మేరకు జిల్లా అధికారులు తాజాగా ప్రతిపాదనలను తయారు చేశారు. నిర్మల్‌లో 9, ఆదిలాబాద్‌లో 6, మంచిర్యాలలో 3, కొమురంభీం ఆసిఫాబాద్‌లో 3 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి నివేదించారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 77 పీఏసీఏసీలు కొనసాగుతున్నాయి. ఈ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో 77 వేల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. పీఏసీఎస్ ద్వారా వ్యవసాయ రుణాలను అందించడం, అలాగే ఎరువులు, విత్తనాలు పంపిణీ కూడా ఇక్కడే కొనసాగుతోంది. ఆర్థికంగా బలోపేతం ఉన్న పలు పీఏసీఎస్‌లు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సైతం నిర్వహిస్తున్నాయి. కొత్త జిల్లాలు ఏర్పాటైనప్పటి నుంచి పీఏసీఎస్‌ల విస్తరణ జరగలేదు. అలాగే ఇటీవల కొత్త మండలాలు కూడా పెద్దసంఖ్యలోనే ఏర్పాటయ్యాయి. దీని కారణంగా ప్రస్తుతం ఉన్న పీఏసీఎస్‌ల పరిధి పెరగకపోవడంతో కొత్తమండలాల రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వారికి సంఘాలలో సభ్యత్వంపై స్పష్టత కరువైపోతోంది. స్థానిక విషయంలో కూడా సాంకేతిక అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం కొత్తమండలాలకు కూడా సేవలు వర్తించే విధంగా కొత్తగా పీఏసీఎస్‌లను ఏర్పాటు చేసుకునేందుకు ప్రతిపాదనలను కోరింది. దీంతో జిల్లా సహకార శాఖ అధికారులు 20 పీఏసీఎస్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించింది.



ముథోల్ మండలంలోని చిద్రెల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇదే

ఇతర సభ్యులకు అవకాశం...

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 77 పీఏసీఏసీలు కొనసాగుతుండగా కొత్తగా ఏర్పడబోయే మరో 20 పీఏసీఎస్‌లతో కలుపుకొని మొత్తం 97 పీఏసీఎస్‌లు ఏర్పడనున్నాయి. దీంతో పీఏసీఏసీల సంఖ్య పెరగబోతున్నందున అందులో కొత్తసభ్యులకు కూడా అవకాశం ఏర్పడబోతోంది. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలోని 17 పీఏసీఏసీలలో 46,928 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. అలాగే కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 12 పీఏసీఎస్‌లకుగానూ 23,788 మంది, ఆదిలాబాద్ జిల్లాలో 28 సంఘాలకు గానూ 59,483 మంది, మంచిర్యాల జిల్లాలో 20 సంఘాలకు గానూ 47,474 మంది రైతులు సభ్యులుగా కొనసాగుతున్నారు. కొత్తగా ఏర్పడబోయే 20 పీఏసీఏసీలలో కొత్తగా మరికొంత మంది రైతులకు సభ్యత్వం లభించనుంది.

కొత్త పీఏసీఎస్‌లకు ప్రతిపాదనలు...

కాగా అధికారులు మొత్తం 20 పీఏసీఎస్‌ఎల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు రూపొందించి సర్కారుకు నివేదించారు. నిర్మల్ జిల్లాలోని ముథోల్, దస్తూరాబాద్, పెంబి, నర్సాపూర్, బెల్‌తరోడా, మాలేగావ్, సోన్, పొన్కల్‌లో కొత్తగా పీఏసీఎస్‌లు ఏర్పాటు కానున్నాయి. అలాగే ఆదిలాబాద్, జిల్లాలోని బోరజ్, సాత్నాలా, సోనాల, గాదిగూడ, భీంపూర్, సిర్పూర్ (యూ)లలోనూ ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపెల్లి, లింగాపూర్, పెంచికల్ పేటలోనూ, మంచిర్యాల జిల్లాలోని భీమారం, కన్నెపెల్లి, నస్పూర్‌లలో కొత్తగా పీఏసీఎస్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించారు.



దిలావర్‌పూర్ మండలం బన్నపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇదే

ప్రభుత్వం పట్టించుకోవాలంటున్న అన్నదాతలు...

మూడేళ్లక్రితం అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తాజాగా పీఏసీఎస్‌ల ఏర్పాటుకు సం బంధించిన ప్రతిపాదనలు రూపొందాయి. అయితే అప్పటి ప్రభు త్వం ఈ ప్రతిపాదనలను పట్టించుకోకుండా పక్కకు పెట్టింది. చాలాసార్లు రైతుసంఘాల నాయకులు ప్రభుత్వంపై కొత్త సహకార సంఘాలకు సంబంధించి ఒత్తి డి తీసుకువచ్చినప్పటికీ ఫలితం కనిపించలేదు. అయి తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైన ఇక్కడి అధికారు లు రూపొందించిన ప్రతిపాదనలను పరిగణలోకి తీసుకోవాలని కోరుతున్నారు. ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు, రైతుసంఘాల నేతలు ఈ ప్రతిపాదనలను మరోసారి ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. అయితే ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం ఈ ప్రతిపాదనలపై తిరిగి చర్యలు చేపట్టేందుకు సిద్ధమైనట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. ఈ ప్రతిపాదనలకు వెంటనే మోక్షం లభించాలని రైతులు కోరుతున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

- ఇందిరమ్మ ఇంటి కోసం..
- కలెక్టరేట్‌లో కలకలం
- విచారణకు అదేశించిన కలెక్టర్


కలెక్టర్ కార్యాలయం భవనం పైకి ఎక్కిన బాధితురాలు

నిర్మల్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటి మంజూరులో జాప్యం జరగడంతో మనస్తాపం చెందిన ఓ మహిళ నిర్మల్ కలెక్టరేట్ భవనం పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించడం సోమవారం తీవ్రకలకలం రేపింది. భైంసా మండలం దేగాం గ్రామానికి చెందిన బాధితురాలు కలెక్టరేట్‌కు చేరుకుని, తమకు న్యా యం చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ, లేదంటే భవనం పైనుంచి దూకి చనిపోతానని అధికారులను హెచ్చరించి పైకెక్కింది. ఇందిరమ్మ ఇళ్లకోసం దరఖాస్తు చేసుకుని చాలా రోజులు గడుస్తున్నా అధికారులు మంజూరు చేయలేదని, గత ప్రభుత్వ హయాంలో డబుల్‌బెడ్ రూమ్ కోసం దరఖాస్తు చేసుకున్నా అన్యాయమే జరిగిందని మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఏడునెలలు గా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగకపోవ డం వల్లే ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు తెలిపింది. సమాచారం అం దుకున్న పోలీసులు, అధికారులు వెంటనే అక్కడికి చేరుకుని మహిళతో ఫోన్‌లో సంభాషణ జరిపారు. ఇంతలో ట్రెజరీ డిపార్ట్ మెంట్‌కి చెందిన కాలేరు మధు ప్రాణాలకు తెగించి బిల్డింగ్ పైకెక్కి మహిళను కాపాడారు.

కలెక్టర్ విచారణకు ఆదేశం...

వెంటనే స్పందించిన సిబ్బంది 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా, ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యత అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని సూచించారు.

దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి...

నిర్మల్ చైన్‌గేట్ : ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి దరఖాస్తును పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారిగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు.

బాధితుల ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

నిర్మల్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు ముఖ్య కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. కార్యక్రమానికి నిర్మల్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. వెంటనే ఫిర్యాదుదారుల ముందే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ల ద్వారా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు పోలీస్‌సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్టప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారుడికి పోలీసుశాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయోనని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్‌డే ద్వారా ప్రజలు నేరుగా వారి సమస్యలను తమ దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పైన సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసి ఫాలోఅప్ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరగకుండా పర్యవేక్షణ చేస్తామని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ పథకాలను బీజేపీ కాపీ కొడుతోంది

● ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌సింగ్

నిర్మల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వ హామీ పథకాలను బీజేపీ కాపీ కొడుతోందని ఏఐసీసీ పరిశీలకుడు అజయ్ సింగ్ అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని మారుతి ఇన్ హోటల్‌లో డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావుతో కలిసి సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు 'సంఘటన్ సుజన్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కాంగ్రెస్ అధ్యక్షులు (డీసీసీ) ఎంపిక చేయనున్నారని, దీని కోసం ఏఐసీసీ పరిశీలకులను నియమించిందని తెలిపారు. దేశంలో మోదీ ప్రభుత్వం ప్రజలను విభజించి పాలిస్తుందని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మోజార్టీ కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు మూడేళ్ల గడువు ఉందని, కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వం అమలు చేసు_న్న పథకాలను గ్రామస్థాయిలో ఇంటింటికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి సముద్రాల వేణుగోపాలచారి, మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖ శ్యామ్‌నాయక్, సారంగాపూర్, నిర్మల్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు అబ్దుల్ హాది, సోమ భీమ్ రెడ్డి, ఆనంద్ రావు పటేల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ, ఆత్మ కమిటీ చైర్మన్ రాంరెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుర్గాభవాని, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఆలూరి కృష్ణవేణి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు సమరసింహా రెడ్డి పాల్గొన్నారు.

భైంసా : పార్టీని పూర్తిస్థాయిలో పటిష్టపరచేందుకు కాంగ్రెస్ శ్రేణులు అంకితభావంతో పాటుపడాలని ఆ పార్టీ పరిశీలకుడు, కర్ణాటక రాష్ట్ర ఎమ్మెల్యే డా.అజయ్‌సింగ్ పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షునికి ఎన్ని క ప్రక్రియలో భాగంగా కార్యకర్తల అభిప్రాయ సేకరణ నిమిత్తం సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు తానూర్ మండలంలోని బెల్‌తరోడా రాష్ట్ర సరిహద్దు వద్ద ముథోల్ కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. పరిశీలకునికి స్వాగతం పలికిన వారిలో భైంసా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షు డు శంకర్ చంద్రే,మాజీ ఎంపీపీ సయ్యాజీ భోజ రాం పాటిల్, కుబీర్ మండల పార్టీ అధ్యక్షులు బసిరుద్దీన్, పార్టీ యువజన విభాగం ప్రతినిధులు పురంశెట్టి రవి కుమార్, అట్టల్ దేవిదాస్, బంకబాబు, జాడే శ్రీనివాస్, సాయినాథ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఓటు చోరీతోనే మోదీ ప్రధాని అయ్యారు...

ఖానాపూర్ : ఓటు చోరీతోనే కేంద్రంలో మోదీ మళ్లీ ప్రధాని అయ్యారని ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌సింగ్ అన్నారు. ఖానాపూర్‌లోని జేకే ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కర్ణాటక తెలంగాణ రాష్ట్రాల ప్రభావం ఇతర రాష్ట్రాలపై పడకుండా బీజేపీ ఎత్తులు వేసిందన్నారు. పుల్వామా దాడి ని హిందూ, ముస్లిం గొడవగా సృష్టించారని ఆరోపించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే తమ నేత రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర చేశారన్నారు.

పార్టీ పదవులు ఇవ్వండి..

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే పార్టీ పదవుల నియామకాలను పూర్తిచేయాలని ఏఐసీసీ పరిశీలకులు అజయ్‌సింగ్‌ను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ కోరారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ చేయలేని ఎన్నో పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ చేస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అంతకుముందు కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాల చారి, మాజీ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్, టీపీసీసీ పరిశీలకులు రాంభూపాల్ పటేల్, జితేంద్ర వర్మ, ధనావతి రెడ్డి, గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు మాట్లాడారు. కార్యక్రమంలో ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ భూమన్న, సారంగాపూర్ మాజీ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, మాజీ మున్సిపల్ చైర్మన్లు చిన్నం సత్యం, అంకం రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడార్ల గంగ నర్సయ్య, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, కృష్ణవేణి, దుర్గాభవాని, తదితరులున్నారు.


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకులు అజయ్‌సింగ్


సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌సింగ్

క్రీడలు ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి

● డీఈవో దర్శనం భోజన్న


విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న డీఈవో దర్శనం భోజన్న

లక్ష్మణచాంద, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని నిర్మల్ డీఈవో దర్శనం భోజన్న అన్నారు. మండల కేంద్రంలోని వడ్యాల్ గ్రామంలో 69వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి ఎంపిక జట్ల అండర్- 14 బాల బాలికల కబడ్డీ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థిని విద్యార్థులకు ఆటల పట్ల ఆసక్తి, అభిరుచి ఉండాలని కోరారు. ఆటల ద్వారా మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించబడుతుందన్నారు. ప్రతిరోజు పాఠశాలల్లో చదువుతో పాటు ఆటలను కూడా సమానంగా నిర్వహిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు తోడ్పడాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆర్. అశోక్ వర్మ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వై. రమణ రావు, గ్రామ మాజీ సర్పంచ్ లింగా గౌడ్, ఉప సర్పంచ్ మోహన్, వీడీసీ పెద్దలు పోలాస గోవర్ధన్, పాఠశాల శ్రేయోభిలాషులు రాజేంద్ర ప్రసాద్, లక్ష్మణ్, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపికైన బాలికల జట్టు...

అఫ్రిన్ బేగం, హర్షవర్ధని, సమంత, అక్షర, అదితి, సాక్షి, రసజ్ఞ, నవనీత, చందన, కే. హర్షిని, గంగోత్రి, చరణ్య. స్టాండ్ బై...మనస్విని, అమీలియా, దీక్ష, శ్రీనిత్య.

అండర్- 14 జిల్లా స్థాయికి ఎంపికైన బాలుర జట్టు...

ఎస్. అజయ్, జి. అజయ్ , సిద్ధు, సాయి, రేమన్ పాషా, వరుణ్ సందేశ్, ఫైజాన్, సంజీవ్, నాగ చరణ్, అర్జున్, కవి కుమార్, శేష రావు స్టాండ్ బై... సుశాంత్, అఖిల్, నాగరాజు, శివ సాయి, జశ్వంత్

ట్రస్మా స్టేట్ మెంటర్ అవార్డు అందుకున్న శ్రీనివాస్‌గౌడ్

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని పంజాగుట్ట ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ట్రస్మాస్టేట్ మెంటర్స్ అవార్డు- 2025-26ను వశిష్ట హైస్కూల్‌చైర్మన్, ట్రస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అందుకున్నారు. అవార్డును రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ఆచార్య ఇటికల పురుషోత్తం చేతుల మీదు గా గొల్లపల్లి శ్రీనివాస్ అందుకున్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, గౌరవ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, రాష్ట్ర ట్రస్మాసంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నూతన మద్యం పాలసీలో రిటైలర్ మార్జిన్

నిర్మల్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నూతన మద్యం పాలసీ 2025-2027లో రిటైలర్ మార్జిన్ ఉంటుందని, మద్యం విక్రయాల్లో ఆర్డినరీ లిక్కర్ పైన 27 శాతం మార్జిన్, మీడియం, ప్రీమియం బీర్‌ల పైన 20 శాతం మార్జిన్ ఉంటుందని అబ్దుల్ రజాక్, జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, నిర్మల్ తెలిపారు. దరఖాస్తులను అక్టోబరు 18 వరకు స్వీకరణకు గడువు ఉందన్నారు. అక్టోబరు 23న మద్యం దుకాణాల దరఖాస్తులను లాటరీపద్ధతిలో డ్రా ద్వారా ఎంపిక చేస్తారన్నారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఎంపిక చేస్తారన్నారు. ప్రతి దరఖాస్తుకు ఆధార్ కార్డు, పాన్ కార్డు, మూడుకలర్ పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలు జతచేయాలన్నారు. ప్రతి దరఖాస్తు వెంబడి రూ.3,00,000ల దరఖాస్తు రుసుముగా నాన్‌రిఫండబుల్ ఫీ చెల్లించాలన్నారు.



దరఖాస్తు చేస్తున్న దృశ్యం

ముగిసిన జోనల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జోనల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్ 2025 అట్టహాసంగా ముగిశాయి. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్‌కోర్టు శ్రీవాణి నిర్మల్ విశిష్ట అతిథిగా, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ బాసర సర్కిల్ శర్వానన్ హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. రెండు రోజులుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నిర్మల్‌క్లబ్‌లో ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్ నిర్వహించారు. అథ్లెటిక్స్‌లో 35 క్రీడావిభాగాల్లో, ఇండోర్ గేమ్స్‌లో 13 విభాగాలలో, టీం ఈవెంట్స్‌లో ఐదు విభాగాలలో క్రీడలు నిర్వహించారు. సుమారు 350 అటవీ క్రీడాకారులు ఈ ఆటల పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. 1. టగ్ ఆఫ్ వార్‌లో నిర్మల్ జట్టు ప్రథమ విజేతగా, నిజామాబాద్ రన్నర్ అప్‌గా, 2. టగ్ ఆఫ్ వార్ (మహిళ)లో ఆదిలాబాద్ జట్టు ప్రథమ విజేతగా, నిర్మల్ జట్టు రన్నర్ అప్‌గా నిర్మల్ జట్టు, 5. కబడ్డీలో నిజామాబాద్ ప్రథమ విజేతగా, ఆదిలాబాద్ రన్నర్ అప్‌గా, 6. కబడ్డీ (మహిళ)లో నిర్మల్ విజేత జట్టుగా, ఆదిలాబాద్ రన్నర్ అప్‌గా, 7. త్రో బాల్ (మహిళ)లో ఆదిలాబాద్ జట్టు విజేతగా నిర్మల్ జట్టు రన్నర్‌అప్‌గా నిలిచాయి.

అధునాతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఖానాపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మరింత నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు సత్తెనపల్లిలో సబ్ స్టేషన్‌లో అధునాతన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ సాలియా నాయక్ పేర్కొన్నారు. సోమవారం సత్తెనపల్లి సబ్ స్టేషన్‌లో రూ, 70 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేసిన 5.00 ఎంవీఏ కెపాసిటీ గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రాబోయే రోజుల్లో రైతులకు, విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇక్కట్లు కలుగకుండా ఉండేందుకు సత్తెనపల్లి సబ్‌స్టేషన్‌లో అధిక లోడు తగ్గించామన్నారు. ఇప్పటి వరకు 3.15 ఎంవీఏ కెపాసిటీతో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 5.00 ఎంవీఏ కెపాసిటీతో ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో డీఈ నాగరాజు, ఎంఆర్‌టీ డీఈఈ హరిచంద్, ఏఈ ఎం. రాంసింగ్ సహా స్థానిక విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన అధికారులు

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిరసన


తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

లక్ష్మణచాంద, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : సోయాబీన్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సోయాబీన్ పంట కోత కోసి పంట ఆరబెట్టే సమయం వచ్చినా... కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందకుండా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వలన రైతులు చాలా నష్టపోయారన్నారు. సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అందుకు సంబంధించి తహసీల్దార్ సరితకు మెమోరాండం సమర్పించారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తా : తహసీల్దార్ సరిత

మొక్కజొన్న, సోయాబీన్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి తన వంతు కృషి చేస్తానని తహసీల్దార్ సరిత అన్నారు. రైతుల డిమాండ్‌ను పై అధికారులకు రిపోర్ట్ చేసి పరిస్థితిని వివరిస్తానన్నారు. వీలైనంత త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు అయ్యేలా సహకరిస్తానని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యులు సంత సాగర్ రెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు పుణ్యమూర్తి కృష్ణ, సంత మధుకర్, ఏలేటి కిరణ్ రెడ్డి, కొమ్ముల విష్ణు రెడ్డి, ఏనుగు ప్రసాద్ రెడ్డి, గంగారెడ్డి, కొమ్ముల మోహన్ రెడ్డి, డాన్ శ్రీను, శిలారి రాము, బొమ్మెన మధు, ఏలేటి సురేష్, ఏలేటి నరేష్ రెడ్డి, సందీప్ రెడ్డి, చిన్న మల్లేష్, ప్రశాంత్ రెడ్డి, మండల రైతులు పాల్గొన్నారు.



గాజిలిలో వైద్య చికిత్సలు అందజేస్తున్న సిబ్బంది

గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు

నేరడిగొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సీజనల్ వ్యాధుల ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డాక్టర్ సద్దాం అన్నారు. సోమవారం మండలం లోని గాజిలి గ్రామంలో వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. రాత్రి మిగిలిన ఆహార పదార్థాలను తినకూడన్నారు. ఇంటి పరిసరాలతో పాటు శారీరక శుభ్రత పాటించాలని సూచించారు. ఇందులో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఏఎన్ఎం రాణి, ఆశా, భాను, ప్రియా, తదితరులు ఉన్నారు.

ఏఐసీసీ పరిశీలకుడిని కలిసిన కంది

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుల నియామకం కోసం నిర్మల్ జిల్లా పర్యటనకు వచ్చిన ఏఐసీసీ పరిశీలకుడు అజయ్ సింగ్‌ను ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్ లో మర్యాద పూర్వకంగా కలిసారు. అంతేకాకుండా శాలువాతో ఆయనను సత్కరించి ఆదిలాబాద్ నియోజక వర్గం గురించి వివరించారు. అనంతరం పలు విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు.

డిజిటల్ గణిత బోధన ముగింపు

ఉట్నూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా విధానంలో భాగంగా మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలోని బీఎడ్ కళాశాలలో గత మూడు రోజులుగా నిర్వహించిన డిజిటల్ గణిత బోధన శిక్షణ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా తెలంగాణ గణిత ఫోరం (టీఎంఎఫ్) ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ (డీఆర్‌పీ)లను గణిత ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. గణిత ఉపాధ్యాయులకు మూడు రోజుల డిజిటల్ బోధన ట్రైనింగ్‌లో భాగంగా చివరి రోజు, శిక్షణ ఇచ్చిన ముగ్గురు డీఆర్పీలు బండిసుభాష్, జాదవ్ నిరూప్‌కుమార్, జాదవ్‌సంతోష్‌లను తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఈ మూడు రోజుల కార్యక్రమంలో విద్యలో సాంకేతికను జోడించే విధానాలు మరియు వివిధ రకాల యంత్రాలు పని చేసే విధానాల గురించి క్షుష్టంగా నేర్చుకున్నట్లు గణిత ఉపాధ్యాయులు తెలిపారు. ఈ ట్రైనింగ్ కార్యక్రమానికి ఇంద్రవెల్లి,ఉట్నూర్, గాదిగూడ, నార్నూర్ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీ సాగుకు శనగ విత్తనాలు సిద్ధం

బోథ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ కింద శనగ విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని అవసరమైన రైతులు విత్తనాలను తీసుకు వెళ్లాలని ఆత్మ చైర్మన్ జి.రాజుయాదవ్ తెలిపారు. సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద రైతులకు శనగ విత్తన బ్యాగులను అందించారు. అంతేకాకుండా 25 కిలోల బస్తా రూ.1250లకు, అలాగే మరో రకం బస్తా 1500 రూపాయల చొప్పున విక్రయించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ట్రైకోడెర్మా ప్యాకెట్ అందివ్వడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు తమ పట్టాదారు పాస్‌బుక్‌ను తీసుకొని ఆధార్ కార్డు జిరాక్స్‌తో రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రవితేజతో పాటు విస్తరణ అధికారులు సంతోష్, వాజిద్, ఆత్మ డైరెక్టర్లు షేక్ అబుద్, మడావి గంగారాం, తదితరులున్నారు.

విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి

● ఐటీడీఏ ముందు విద్యార్థుల, పోషకుల ధర్నా ● పీవో రావాలని పట్టుబట్టిన తల్లిదండ్రులు ● సముదాయించిన అధికారి

ఉట్నూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలంటూ గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం ఐటీడీఏ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల ఉంచి తరలివచ్చిన విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ గత మూడేళ్లుగా ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకుంటున్న సుమారు ఏడు వేల మంది గిరిజన విద్యార్థుల ఫీజులను చెల్లించడం లేదన్నారు. దీంతో పాఠశాలల యజమాన్యాలు విద్యార్థులను పాఠశాలలకు రానీయకుండా అడ్డుకోవడంతో దసరా సెలవులకు వచ్చిన విద్యార్థులు సెలవులు ముగిసినా.. పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. గత జూన్‌లో సైతం బీఏఎస్ యాజమాన్యాలు విద్యార్థులను రానీయక పోవడంతో రూ.2వేలు, రూ.3వేలు చెల్లించామని, ప్రభుత్వం నిధులు ఇస్తుందని అప్పటి వరకు ఇబ్బంది కలిగించవద్దని వేడుకోవడంతో పాఠశాలల్లో చేర్చుకున్నారని అన్నారు. దసరా సెలవుల తర్వాత కూడా ఫీజులు ప్రభుత్వం నుంచి వస్తేనే రావాలని ఆదేశించడంతో పిల్లలను ఇంటి వద్దనే ఉంచుకున్నామని వివరించారు.

కాగా, ఉట్నూర్, ఇచ్చోడ సీఐలు మడావి ప్రసాద్, బండి రాజు పోలీసులతో చేరుకొని విద్యార్థుల, పోషకులను సముదాయించే ప్రయత్నం చేశారు. పీఓ వద్దకు ఐదుగురు ప్రతినిధులు రావాలని కోరడంతో పీఓనే బయటకు రావాలంటూ గిరిజనులు నినాదాలు చేస్తూ బైఠాయించారు.

● సముదాయించిన ఐటీడీఏ పీవో

ఉట్నూర్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా వద్దకు వెళ్లి విద్యార్థుల తండ్రులు వినడం లేదని, పీఓగారు వచ్చి సమస్యలు వినాలని పట్టుపడుతున్నారని తెలపడంతో పీవో విద్యార్థుల, గిరిజనుల ధర్నా వద్దకు చేరుకుని మాట్లాడారు. 'ఇది చాలా బాధాకరంగా ఉంది, ముఖ్యమంత్రి పేషీలో చర్చలు జరుగనున్నాయి. రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది' అంటూ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా విద్యార్థుల తల్లిదండ్రులను సముదాయించారు. విద్యార్థులు సెలబస్ నష్టపోతున్నారని, పరిష్కారమయ్యేవరకు ఇక్కడే ఉంటామని విద్యార్థుల తల్లిదండ్రులు తెలపడంతో.. పైఅధికారులతో మాట్లాడి సమస్యలు వివరించడం జరిగిందని, బెస్ట్ అవైలబుల్ అసోసియేషన్ నాయకులు ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నందున సమస్య పరిష్కారం అవుతుందని పీవో అన్నారు. అయినప్పటికీ గిరిజనులు పీవో క్యాంపు కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టేకం వసంత్ రావు, పెందూర్ దీపక్, గంట సత్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, పోషకులతో మాట్లాడుతున్న పీవో ఖుష్బుగుప్తా

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్

● డిమాండ్ల సాధనే లక్ష్యంగా వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు



సీజేఐపై దాడికి నిరసనగా ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన



మమ్మల్ని బడికి పంపండి అంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నిరసన



పత్తి మొక్కలను చేతపట్టుకుని నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధనే లక్ష్యంగా సోమవారం వివిధ సంఘాల నేతృత్వంలో ఆందోళనలు చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసనలు తెలియచేసి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

సీజేఐ గవాయ్‌పై జరిగిన దాడి రాజ్యాంగంపై జరిగిన దాడితో సమానమని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నంద కార్తీక్ అన్నారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడిని ఖండిస్తూ ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. దాడి చేసిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన నినాదాలు చేశారు. మేరకు ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కార్తీక్ మాట్లాడారు. ధర్నాలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్, శ్రీకాంత్, కిషోర్, ప్రేమ్ రాజ్, గణేష్, రవి పాల్గొన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూళ్లకు ప్రభుత్వం వెంటనే నిధులను విడుదల చేయాలని విద్యార్థుల తల్లితండ్రులు డిమాండ్ చేశారు. నిధులు విడుదల కాని కారణంగా తమ పిల్లలు ఇండ్లల్లోనే ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి తల్లితండ్రులు ఆందోళన చేపట్టారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన కార్పొరేట్ విద్యనూ అందించేందుకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్‌లలో ప్రవేశాలను కల్పించిందని, మూడేళ్లుగా బిల్లులు రావడం లేదని వాపోయారు. తమ పిల్లల చదువు అర్ధాంతరంగా ఆగిపోయే ప్రమాదం ఉన్న నేపథ్యంలో కలెక్టర్ వెంటనే స్పందించాలని కోరారు.

జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, వెంటనే వారికి నష్టపరిహారం అందించేలా తగు చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష రైతు సంఘం నేతలు బండి దత్తాత్రి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరం ఎదుట సోమవారం ఎండిపోయిన పత్తితో రైతు సంఘం నేతలతో కలిసి నిరసన తెలిపారు. కలెక్టర్ రాజర్షి షా కు వినతిపత్రం అందించి రైతుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా బండి దత్తాత్రి మాట్లాడారు.

మద్దతు.. దక్కేనా?

(5వ పేజీ తరువాయి...)

నిర్వహించనున్నారు. ఆ తర్వాతనే కొనుగోళ్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి.

కష్టమంతా దళారుల పాలు

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు అత్యవసరాల పేరిట పంటను అమ్మేసుకుంటున్నారు. దీంతో కష్టమంతా దళారుల పాలవుతుంది. వానాకాలం సీజన్‌లో తొలి పంటలుగా చెప్పుకునే పత్తి, సోయా పంటలు చేతికి రావడంతో పెట్టుబడి ఖర్చులను తీర్చుకునేందుకు ధర తక్కువైనా స్థానికంగానే అమ్మేసుకుంటూ అప్పులు తీర్చుకుంటున్నారు. అలాగే దీపావళి పండుగా కూడా సమీపిస్తుండడంతో పండుగ ఖర్చుల కోసం ఆధారబాధరగా అమ్ముకుంటున్నారు. నగదును ఆశచూపుతున్న దళారులు రైతుల ఇళ్ల వద్దకే వెళ్లి పత్తి, సోయాలను కొనుగోలు చేస్తున్నారు.బయట మార్కెట్‌లో ప్రస్తుతం సోయలు రూ.4వేల నుంచి రూ.4500 వరకు, పత్తి క్వింటాల్‌కు రూ.6వేల నుంచి రూ.7వేలలోపే ధర పలుకుతుంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట దళారుల పాలవుతుంది. ఇలాంటి పరిస్థితులతో కొందరికే మద్దతు దక్కే అవకాశం ఉందంటున్నారు. ఇకనైనా అధికారులు పత్తి, సోయా పంటలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



గాడిదకు వినతిపత్రం అందిస్తూ వినూత్న నిరసన తెలుపుతున్న నేతలు

ఇళ్ల నిర్మాణాల నిధులను విడుదల చేయాలి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పీవీటీజీలకు సొంత ఇంటి నిధుల కోసం కేంద్రం నిధులను విడుదల చేయగా.. వాటి విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని భీం ఆర్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ షకీల్ అన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తెలంగాణ చౌక్‌లో గాడిదకు వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా షేక్ షకీల్ మాట్లాడుతూ.. పీవీటీజీలకు 2023లో కేంద్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకునేందుకు నిధులు విడుదల చేసిందని, రెండేళ్లుగా డబ్బులు రావడంతో వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని నిధులు విడుదల చేయని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు.

జాతిని దుర్భాషలాడిన వెంకటేష్‌పై ఫిర్యాదు

ఉట్నూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ ప్రధాన్ పురోహిత్ జాతిపై దుర్భాషలాడిన వెడమ వెంకటేశ్ సామాజిక మాధ్యమంలో రెచ్చగొట్టే విధంగా పోస్టు చేసనందున ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ప్రధాన్ పురోహిత సమాజ సభ్యులు సోమవారం ఉట్నూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సామాజిక మాధ్యమంలో ఆయన పెట్టిన పోస్టును ఖండిస్తూ దుర్భాషలాడిన వ్యక్తి వెడ్మ వెంకటేశ్‌పై తగు చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మడావి ప్రసాద్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందని మేస్రం కేశవ్, గోడంనీరంజన్‌లు తెలిపారు. ట్రైబ్ విలేజ్ ఛానల్ ద్వారా గిరిజనుల మనోభావాలు దెబ్బతినేలా దుర్భాషలాడారని మండిపడ్డారు. వీరివెంట మడావి బాలాజి, పుర్కాగజానంద్, ఆత్రం వెంకటేశ్, ఆత్రం శేషనారాయణ, మేస్రం శివచరణ్, పూసం భీమ్రావు, మేస్రం గణేష్, మడావి శాంతరాజ్, మోహన్, కనక సంతోష్‌లున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

తానూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తానూర్ మండల కేంద్రంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొనగా వృద్ధుడు మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముధోల్ గ్రామానికి చెందిన మాల్వే ఎంకోబా(70) అనే వృద్ధుడు ఇండియన్ గ్యాస్‌గోదాం దగ్గర ఆదివారం రాత్రి రోడ్డు పక్కన పడుకోవడంతో గుర్తుతెలియని వాహనం ఆయనపై నుంచి వెళ్లడంతో ఎంకోబా అక్కడిక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి కుమారులు బాలాజీ పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై షేక్ జుబేర్ ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుడి కుమారుడు బాలాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌జుబేర్ తెలిపారు.

మృతదేహం లభ్యం..

నిర్మల్‌రూరల్:జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈనెల 8న ఆసుపత్రిలో ఈ వ్యక్తి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి కుడిచేతిపై మామ్, డాడ్ అని పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

తానూర్ : మండంలోని ఎల్విలో సోమవారం గుర్తుతెలియని మృతదేహం అవయవాలు లభ్యమైనట్లు ఎస్సైషేక్ జుబేర్ తెలిపారు. గ్రామంలోని సబ్‌స్టేషన్ పక్కకు మేకల కాపరి గుర్తుతెలియని వ్యక్తి తల అవయవాలు కనిపించడంతో గ్రామస్తులకు తెలుపగా గ్రామస్తులు పోలీసులకు తెలుపగా భైంసా ఏఎస్పీ అవినాష్, ముధోల్ సీఐ మల్లేష్, ఎస్సై షేక్ జుబేర్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అవయవాలను పరిశీలించి భైంసా ఏరియాసుపత్రి డాక్టర్‌ను పిలిచి ల్యాబ్ ఫోరెన్స్‌కు పంపించారు. త్వరలోనే పూర్తి వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి రెండు రోజుల జైలు

నిర్మల్‌రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తిని పోలీసులు గుర్తించి, మద్యం మెతాదును పరీక్షించి కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ కేసు న్యాయస్థానానికి తరలించగా సోమవారం ప్రత్యేక న్యాయమూర్తి వి.నర్సయ్య విచారణ జరిపి నిందితుడు చిందం రమేష్‌కు రెండురోజుల సాధారణ కారాగార శిక్షణ విధించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ... మద్యం సేవించి వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతాయి. ప్రజల ప్రాణాలకు ముప్పు కలుగుతుంది. అందువల్ల మద్యం తాగి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయి. ప్రతిఒక్కరూ చట్టాన్ని గౌరవించి రోడ్డుభద్రత నియమాలను పాటించాలని సూచించారు.

విద్యుత్‌షాక్ తగిలి ఒకరి మృతి

పెంబి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) :విద్యుత్ వైర్ తగిలి ఒకరు మృతి చెందారు. మండలంలోని పెంబి తండా గ్రామపంచాయతీ పరిధిలోని అక్టోనిమాడ గ్రామానికి చెందిన ఆత్రం లింబారావు(29) గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో అటవీ జంతువుల కోసం వేటగాళ్లు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్ తగిలి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. సంఘటనాస్థలాన్ని సీఐ అజయ్, ఎస్సై హన్మాండ్లు పరిశీలించి తెలిపిన వివరాల ప్రకారం పెంబి తండా గ్రామ శివారులో అటవీ ప్రాంతంలో ఈ నెల 11న అటవీ జంతువుల వేట కోసం రాజు అనే వ్యక్తి విద్యుత్ వైర్లు అమర్చడంతో అటు నుంచి వెళ్తున్న ఆత్రం లింబారావు విద్యుత్ వైర్లు తలిగి అక్కడికక్కడే మృతిచెందాడని తెలిపారు. మృతుడికి ముగ్గురు పిల్లలు, భార్య ఉన్నారని, ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లోకేశ్వరం శివాలయం హుండీ లెక్కింపు

లోకేశ్వరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని శివాలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ లెక్కింపులో 39,055 రూపాయలు వచ్చాయని ఆలయ అభివృద్ధి కమిటీ వారు తెలిపారు. హుండీ లెక్కింపులో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గంగాధర్, క్యాషియర్ నగేష్, మాజీ సర్పంచ్ మెండే శ్రీధర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ చిన్నారావు, రాజశేఖర్, శ్రీనివాస్, లక్ష్మణ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి ఆర్థిక సాయం

భైంసా, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థినిక దోమల రాజేశ్వరి జాతీయ స్థాయి వుషూ పోటీలకు ఎంపికయింది. ఈ నెల 22 నుంచి జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననుంది.అయితే సదరు విద్యార్థిని కుటుంబ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండటంతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. సంబంధిత విద్యార్థిని కుటుంబ ఆర్థిక పరిస్థితి వివరాలు తెలుసుకున్న భైంసా మున్సిపల్ మాజీ కౌన్సిలర్ చందులాల్ సోమవారం పాఠశాలకు వెళ్లి విద్యార్థినిని అభినందించి తనవంతుగా కొద్దిమేర ఆర్థిక సాయం అందించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం సైతం తమ వంతుగా ఒక్కొక్కరు రూ.500 చొప్పున ఆర్థిక సాయం అందించారు.మరికొంత మంది దాతలు ఆర్థిక సాయం అందిస్తే సదరు విద్యార్థిని జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే పరిస్థితులు నెలకొని ఉన్నాయి.



విద్యార్థినికి ఆర్థిక సాయం అందచేస్తున్న మాజీ మున్సిపల్ కౌన్సిలర్

సుడిదోమ నివారణకు చర్యలు తీసుకోవాలి

● ఏవో వినోద్



వరి పంటను పరిశీలిస్తున్న ఏవో అంజిప్రసాద్

సోన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పలు వరి పంట పొలాలను మండల వ్యవసాయ అధికారి జి.వినోద్‌కుమార్ పరిశీలించారు. వరి పంటలో అక్కడక్కడ సుడిదోమ ఆశించడం జరిగిందని తెలిపారు. సుడి దోమ గోధుమ, తెలుపు రంగులో ఉండి మొక్క మొదళ్లలో గుంపులుగా చేరి రసం పీల్చడం వలన పంట సుడులుగా ఎండిపోవడం జరుగుతుందని తెలిపారు. ఇది ఆశించిన తొలి దశల్లో నివారించకుంటే పంట పూర్తిగా ఎండిపోయి తాలు గింజలుగా మారి దిగుబడులు గణనీయంగా క్షీణిస్తాయి. దీని నివారణకు ముందస్తుగా పొలాన్ని ఆరబెట్టి, నీటిని తగ్గించి పంటలో పాయలుగా తీసి మొక్క మొదళ్ళ పైన పైమెట్రోజెన్ 0.60 గ్రాములు, ట్రై ఫ్లూమెజాపైరం 0.485 గ్రాములు, బుప్రొఫెజెన్ 1.06 మిల్లీమీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. కార్యక్రమంలో రైతులు బుచ్చన్న, శ్రావణ్ పాల్గొన్నారు.

శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం అత్యవసరం : సీడీపీవో



వద్యాల్‌లో మాట్లాడుతున్న సీడీపీవో నాగలక్ష్మి

లక్ష్మణచాంద, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం అత్యవసరమని నిర్మల్ సీడీపీవో నాగలక్ష్మి అన్నారు. మండలంలోని వద్యాల్ గ్రామంలో నిర్వహించిన 'పోషణ అభియాన్-పోషణ మాసం' కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... చిన్నారులందరూ మానసికంగా, శారీరకంగా చాలా దృఢం గా ఉండాలంటే పోషకాహారం తప్పకుండా ఇవ్వాలన్నారు. పోషక విలువలు గల ఆహారం గురించి అంగన్‌వాడీ టీచర్ల సలహాలను పోషకులు పాటించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న పోషకాహారంతో పాటు టీచర్ల సలహాల ప్రకారం పలు రకాల పండ్లు, కూరగాయ లు, పప్పుదినుసులను నిత్యం కూరలుగా ఉపయోగించాలన్నారు. పోషక విలువలు గల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఆయా పదార్థాం పోషక విలువలను వివరించారు. అలాగే అన్నప్రాసన-అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో మానస, సూపర్‌వైజర్ పసుపుల భాగ్యవతి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, పోషకులు, తదితరులున్నారు.

ఓటు చోరీపై సంతకాల సేకరణ

కడెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగాపూర్, మాసాయిపేట్, మద్దిపడగ గ్రామాల్లో పెద్దఎత్తున మహిళలతో ఓటు చోరీ సంతకాల సేకరణ చేశారు. ఆల్‌ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ ఆదేశాల మేరకు తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత రావు ఆధ్వర్యంలో ఓటుచోరీ కార్యక్రమాన్ని ప్రతిజిల్లాలోకి తీసుకెళ్తున్నట్లు నిర్మల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సిహెచ్.దుర్గాభవాని తెలిపారు. ఇందులో భాగంగా నిర్మల్ జిల్లాలోను ఓటు చోరీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు తెలిపిరు. కార్యక్రమంలో కడెం మండల మహిళా ప్రెసిడెంట్ సురేఖ, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు ఎం.గంగవ్వ, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

పూర్వవిద్యార్థికి సన్మానం

కుంటాల, అక్టోబరు, 13 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు వాసవి కళాశాలలో గతంలో చదువుకొని ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన మండలంలోని అందకూర్ గ్రామానికి చెందిన హరిణి అనే విద్యార్థినిని సోమవారం కళాశాల యాజమాన్యం ఘనం గా సన్మానించింది. ఈ సందర్భంగా వైద్యవిద్య వృత్తిలో మంచి పేరు ప్రఖ్యాతలు సాధించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు సాయిలు శ్రీనివాస్, సంతోష్, కరస్పాండెంట్ జానకిరామ్ విద్యార్థులున్నారు.

ఉన్నత న్యాయవిద్య ఎల్‌ఎల్‌ఎంకు ఎంపిక

తానూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఝరి(బీ) గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ తుమ్మల మాధవరావు కూతురు తుమ్మల అఖిల భారతి ఉన్నత న్యాయవిద్య ఎల్‌ఎల్‌ఎం కోర్సుకు ఎంపిక అయింది. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన తండ్రి ఆర్టీసీ బస్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నేపథ్యం నుంచి వచ్చిన అఖిల భారతి ఉన్నత న్యాయవాద ఎల్‌ఎల్‌ఎం సీటు సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

టీఎన్జీవోలో చేరిన ఐసీడీఎస్ సిబ్బంది

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అర్బన్‌లోని బంగల్‌పేట్, శరత్ మాల్ సెక్టార్‌ల నుంచి పలువురు ఆయాలు, అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూ నుంచి టీఎన్‌జీవోస్‌లో చేరారు. సంబంధిత అధ్యక్ష, ఉపాధ్యక్షులు సంపూర్ణ, వంగ వరలక్ష్మి తెలిపారు. మొత్తం 36 మంది టీఎన్జీవోస్‌లో చేరినట్లు వివరించారు.

205 ఎకరాల పంట నాశనం

నర్సాపూర్(జి), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల వ్యవసాయ అధికారులు అందించిన నివేదిక ప్రకారం... మొత్తం నష్టం 205.35 ఎకరాలుగా లెక్కించారు. గొల్లమాడ గ్రామంలో అత్యధికంగా 69.00 ఎకరాల పంట నష్టం జరిగింది. ఇక్కడ 85 మంది రైతులు ప్రభావితమయ్యారు. అర్లీ(కే) గ్రామంలో కేవలం 0.15 ఎకరాల నష్టం మాత్రమే నమోదైంది. మండలంలో ప్రధానంగా పత్తి సుమారు 145 ఎకరాలు, వరి సుమారు 28 ఎకరాలు, సోయా దాదాపు 6.7 ఎకరాలు, ఆయిల్ పామ్ 4 ఎకరాలు, కంది 2 ఎకరాలు నష్టం జరిగింది. నష్టపోయిన పంటలలో పత్తి అత్యధికంగా సుమారు 145 ఎకరాలు ఉంది. భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను మండల వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో) క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను అందించారు. చెంద్యాల గణేష్ (గొల్లమాడ క్లస్టర్), కాల్వ రమ్య (చాట్‌పల్లి క్లస్టర్), భాగ్యలక్ష్మి (నర్సాపూర్(జి) క్లస్టర్) ఈ సమగ్ర నివేదికలను వారు మండల వ్యవసాయ అధికారికి సమర్పించారు. మండల వ్యవసాయ అధికారి రామచంద్ర నాయక్ ఈ వివరాలను ప్రభుత్వానికి అందజేశారు. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి, ఆదుకోవాలని రైతులు ప్రభుత్వానికి కోరుతున్నారు.

మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేత

లోకేశ్వరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : లోకేశ్వరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మెడికల్ ఆఫీసర్‌కు సోమవారం ఆశా కార్యకర్తలు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ... మంగళవారం ఖానాపూర్‌లో జరగబోయే జిల్లా మహాసభలకు హాజరవడానికి ఆశా కార్యకర్తలకు మంగళవారం అనుమతి ఇవ్వవలసిందిగా మెడికల్ ఆఫీసర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కుక్కలు, కోతుల బెడదపై చర్యలు తీసుకోవాలి

నిర్మల్ రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : కుక్కలు, కోతుల బెడదపై పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ అభిలాష అభినవ్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు మాజీకౌన్సిలర్లు రఫీ అహ్మద్ ఖురేషి, మహమ్మద్ ముజాహిద్ అలీ, ఎంఐఎం సభ్యులు సయ్యద్ అత్తర్ హుస్సెన్ తెలిపారు. పట్టణంలోని కాలనీలలో తిరగాలంటే కుక్కలబెడదతో భయంగా ఉందని, ఇప్పటికే పలువురికి కుక్కలు కాటేశాయని, కోతులు సైతం పలువురిపై దాడులు, ఇళ్లలో చొరబడి వీర విహారం చేస్తున్నాయని కలెక్టర్‌కు తెలిపారు.

ఆదివాసీ గూడేల్లో మార్మోగనున్న
సంప్రదాయ వాయిద్యాలు

» నేడు భోగీ పండగతో వేడుకలు షురూ » ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా గుస్సాడీ నృత్య సంబురాలు » కొలబొడితో ముగింపు



డప్పులను తయారు చేస్తున్న పూసం శ్యామ్‌రావు



గుస్సాడీ టోపీలతో..



గుస్సాడీల సామగ్రికి ఇంటి ఆడబిడ్డల పూజలు

ఇంద్రవెల్లి,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దండారి పండుగ అంటేనే ఆదివాసీ గూడేల్లో అంబరాన్నంటే వేడుక.ఆదివాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్యదేవత 'ఏత్మా సార్‌పేన్' పేరిట చేసే ప్రత్యేక పూజోత్సవం.డప్పుల దరువు,గజ్జెల మోత, గుస్సాడీలు వేసే స్టెప్పులతో గూడేలు దద్దరిల్లనున్నాయి. ఒకవైపు కోలాట నృత్యాలు, మరో వైపు గోండి పాటల నృత్యం, హాస్యనాటికల ప్రదర్శనలతో ఈ వేడుకలు అలరించనున్నాయి. దీపావళికి ముందు భోగి పండుగతో ఈవేడుక ప్రారంభం కానుంది. భోగితో ప్రారంభమై,కొలబొడితో ముగుస్తుంది. వారం, పదిరోజుల పాటు నిర్వహించే ఈవేడుకలకు గూడేలన్నీ సిద్ధమవుతున్నాయి.

కఠోర దీక్ష... గుస్సాడీల సొంతం

దండారిలో గుస్సాడీల పాత్ర కీలకం. నెమిలి పింఛంతో చేసిన టోపీలు, ముందు రెండు పశువుల కొమ్ములు, మధ్యలో ఓ అద్దం, చుట్టూ రంగురంగుల అలంకరణ వస్తువులు, భుజానికి అడవి జంతువుల తోలు, నడుము, కాళ్లకు గజ్జెలు, మెడలో రుద్రాక్షమాల వేసిన ఆదివాసీ దేవుని ప్రతిరూపమే గుస్సాడీలు. భోగి పండుగతో మాలధారణ వేసినప్పటి నుంచి వారు దీక్షలో కొనసాగుతారు. దీక్ష చేపట్టిన నాటి నుంచి పూర్తయ్యే వరకు స్నానాలు ఆచరించకుండా, చలిలోనూ పాదరక్షలు, బట్టలు ధరించకుండా కఠోర దీక్షలో ఉం టూ నేలపైనే నిద్రిస్తారు.

ఆద్యంతం వినోదభరితం

ఓ గ్రామానికి చెందిన దండారీ బృం దం మరో గ్రామానికి బయలుదేరి వెళ్లడం ఓవినోదపు కార్యక్రమం. గుస్సాడీ బృందం ఏ గ్రామానికి వెళ్లాలన్నా రాత్రి పూటనే బయల్దేరుతారు. రాత్రంతా నృ త్యాలు, గోండి పాటలపై డ్యాన్సులు, హా స్యపు నాటికలు ప్రదర్శించి మిగతా వారికి వినోదాన్ని అందిస్తారు. ఈ సందర్భం గా వచ్చిన అతిథులకు ఘనస్వాగతం ప లికిన అనంతరం మరుసటి రోజున ప్ర త్యేక విందును ఏర్పాటు చేసి వీడ్కోలు పలుకుతారు.దీంతో రెండుగ్రామాల మధ్య స్నేహభావం పెంపొందుతూ,సంస్కృతీసంప్రదాయలు కాపాడుకునే వీలుంటుంది.

కొలబొడితో వేడుకలు ముగింపు

అంబరాన్నంటేలా నిర్వహించే దండారి ఉత్సవాలు కొలబొడితో ముగిస్తారు. తమ కార్యక్రమాలు, అతిథుల రాకపోకలు పూర్తి కాగానే గ్రామంలోని దండారి బృందం ఇంటింటికీ వెళ్లీ దర్శనం ఇస్తారు. దీంతో ఇంటి గృహిణి ఓ పల్లెంలో ధాన్యాలు, తోచిన నగదు ఉంచిన హారతిని వారికి అందిస్తారు. దానిని వారు సంతోషంగా స్వీకరించి ఇంట్లో అందరూ బాగుండాలని,పాడిపంటలు సమృద్ధిగా పెంపొందాలని పాటలు పాడుతూ హారతి పూజ నిర్వహిస్తారు. ఇలా అన్ని ఇండ్లు పూర్తి కాగానే కొలబొడి నిర్వహించి కార్యక్రమాన్ని ముగిస్తారు.

గుస్సాడీ టోపీలు, డప్పుల తయారీ

దీపావళి పండుగ సందర్భంగా గోండులు, కొలాం గిరిజనులు నిర్వహించే దండారీ ఉత్సవాలకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలకు అవసరమైన గుస్సాడీ టోపీలతోపాటు డప్పులు తయారు చేస్తున్నారు. మండలంలోని దుర్వగూడ గ్రామానికి చెందిన పూసం శ్యాంరావు, దుర్వ గంగారాంలు దండారి ఉత్సవాలకు సంబంధించిన అన్ని రకాల సామగ్రితో పాటు పరికరాలు, నెమలి ఈకలతో గుస్సాడీ టోపీలు, కొత్త డప్పులు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గిరిజన గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వీటిని కొనుగోలుచేసేందుకు తరలివస్తున్నారు.

17 నుంచి పద్మల్‌పురిలో దండారి ఉత్సవాలు

ఉట్నూర్: ఉమ్మడి జిల్లాలోని ఆదివాసులు గిరిజనుల దీపావళి గుస్సాడీ దండారి ఉత్సవాలు దండేపల్లి మండలంలోని గుడిరేవు వద్ద ఉన్నపద్మలపురి కోకో ఆలయం ముందు ఈ నెల 17 నుంచి గుస్సాడి దండారి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు మేస్రం దుర్గుపటేల్,ఆదిలాబాద్ జిల్లా తుడుందెబ్బ అధ్యక్షుడు పెందూరు దాదిరావులు తెలిపారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో దీపావళి దండారి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మల్‌పూరి కాకోబాయి, యేత్మసూర్ దేవస్థానం గుస్సాడి దండారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు అధిక సంఖ్యలో హాజరై గుస్సాడి దండారి ఉత్సవాలను విజయవంతం చేయాలని మేస్రం దుర్గుపటేల్ పెందోర్‌దాదిరావులు కోరారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ కుంరానంద్‌రావు,తొడసం దేవరావు, కోట్నాక దేవుశావ్,యాదవ్‌రావు తదితర పెద్దలు పాల్గొన్నారు.

నేటి భోగి పండుగతో గుస్సాడీ వేడుకలు ప్రారంభం

బోథ్: అడవుల ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన గూడెలలో గుస్సాడీ దండారి ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. గూడెల పటేళ్లు గుస్సాడీలు ధరించే నెమలి ఈకల టోపీ వాయిద్యాలతో పాటు అత్యంత చర్మాలకు పూజలు చేశారు. సోమవారం పార్డీ బి గ్రామ పటేల్ అమృత గుసాడి సామగ్రికి పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని ఆడబిడ్డలు గుస్సాడీలు ధరించే సామాగ్రికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కోళ్ల భోగి పేరుతో మొదటి రోజున ప్రారంభమైన పూజల అనంతరం ఈ వేడుకలు దీపావళి పండుగ వరకు కొనసాగుతుంటాయి. మరోవైపు దండారి పండు ఆదిత్యానికి మారుపేరుగా నిలుస్తుంది.

గూడెలలో పెళ్లి సంబంధాల వేదిక

గుస్సాడీ పండుగ సందర్భంగా గూడెలలో గుస్సాడీలు నృత్యాలు చేసి సందర్భంగా పెండ్లి ఎంపికలు జరుగుతాయి. గుస్సాడీ వేషాలు వచ్చిన గ్రామాలలో నృత్యాలు తిలకించే సందర్భంలో ఆదివాసీ గిరిజన యువతి యువకులు తొలిచూపులు ఉంటాయని ఆదివాసీ పెద్దలు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా దండారి పండుగతో వారం రోజుల పాటు గిరిజన గూడెం దప్పు వాయిద్యాల సప్పులతో గూడెం ప్రజలు సంబరాలు ఉంటారు.

ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిబ్బంది కొరత

» అటెండర్లు, అసిస్టెంట్లు లేక ఇబ్బందుల్లో విద్యార్థులు, అధ్యాపకులు



ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ముథోల్,అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాన్ - టీచింగ్ సిబ్బంది తీవ్ర కొరత కారణంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు, అధ్యాపకులు పేర్కొంటున్నారు. అటెండర్లు, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్,వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు,అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2 అటెండర్ పోస్టులు, 1 జూనియర్ అసిస్టెంట్, 1రికార్డు అసిస్టెంట్, 1 సీనియర్ అసిస్టెంట్, 1వాచ్‌మెన్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. ప్రస్తుతం కళాశాలలో సుమారు 200ల మంది విద్యార్థులు విద్యనుఅభ్యసిస్తున్నారు.అయితే టీచింగ్ సిబ్బంది పూర్తిస్థాయిలో ఉన్నప్పటికీ నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా విద్యార్థుల రికార్డులు,సర్టిఫికెట్లు, పరీక్షా ఫైళ్ల సంరక్షణలో కొంత మట్టుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.అధ్యాపకులు అదనపు భారం మోస్తూ పనులు చేసుకుంటున్నారు.సిబ్బంది కొరత కారణంగాఅధ్యాపకులు పరిపాలనా పనులను స్వయంగా నిర్వర్తిస్తు న్నారు.

విద్యార్థుల సేవలకు అంతరాయం

అటెండర్లు లేకపోవడంతో తరగతి గదుల పరిశుభ్రత,ల్యాబ్ నిర్వహణ, విద్యార్థుల పత్రాల పంపిణీ వంటి పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.రికార్డు అసిస్టెంట్ లేకపోవడంతో డాక్యుమెంట్ల జారీ ప్రక్రియల్లో ఆలస్యం జరుగుతోంది.వాచ్‌మెన్ పోస్టులే లేకపోవడం వల్ల సాయంత్రం తర్వాత కళాశాల భద్రతకు భంగం కలుగుతోంది.ఇప్పటికైనా ఉన్నతాధికారులుస్పందించి ముథోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేసి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, పోషకులు, విద్యావంతులు కోరుతున్నారు.

దొంగను వెంబడించి పట్టుకున్న యజమాని

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాంధీ చౌక్‌లోని ఏ-వన్ ట్రేడర్స్ దుకాణం ముందు నుంచి గ్రైండర్‌ను చోరీ చేయడానికి యత్నించిన నిందితుడిని అరెస్టు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.దుకాణం ముందుపెట్టిన మిక్సీని తస్కరించే యత్నం చేయగా యజమాని సల్మాన్ హుస్సేన్ వెంబడించి పట్టుకున్నారన్నారు. దుకాణం యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని జైలుకు తరలించామన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సంజయ్‌నగర్‌లో ఈనెల 10న రోడ్డుపై జన్మదిన వేడుకలను జరుపుకున్న ఐదుగురిపై క్రిమినల్ కేసునమోదు చేసినట్లు ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కె.నాగరాజు తెలిపారు.సంజయ్‌నగర్ కు చెందిన షేక్‌సలీం జన్మదినోత్సవాన్ని డాల్డా కంపెనీ కాలనీకి చెందిన అతని మిత్రులు షేక్ బబ్లూ, సయ్యద్‌నవీద్, ఎండిసల్మానుద్దీన్, అముల్ మౌచీలతో కలిసి రహదారిపై వేడుకలను జరుపుకు న్నారన్నారు.కాలనీవాసులకు ఇబ్బందులు కలిగిస్తూ న్యూసెన్స్‌చేసిన వారిపై కేసు నమోదు చేశామన్నారు.

ఒకరిపై పోక్సో..

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలికకు దుష్టశక్తి సోకిందని నమ్మించి.. మంత్ర తంత్రాల పేరుతో లైంగికంగా వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఒక కాలనీకి చెందిన బాలిక(17) ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గాదిగూడ మండలం మారెగాంకు చెందిన షేక్ కలీంను బాలిక కుటుంబ సభ్యులు సంప్రదించారు. ఆయన ఇటీవల వచ్చి బాలికను పరిశీలించి దుష్టశక్తి సోకిందని నమ్మించాడు.అమ్మాయిని నిర్మల్ మండలం సోన్ వద్ద గోదావరి వద్దకు తీసుకెళ్లి తిరిగి తీసుకొచ్చాడు. అనంతరం రెండు రోజులకిందట సైతంఇంట్లోనే ఒంటరిగా ఉన్న అమ్మాయిని నమ్మబలికి గదిలోకి తీసుకెళ్లాడు. ఒంటరిగా ఉన్న అమ్మాయిని లైంగికంగా వేధించాడు.ఆమె కుటుంబ సభ్యులకు తెలపటంతో వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లైంగికంగా వేధించినందుకు నిందితునిపై బ్లాక్‌మ్యాజిక్ రిమెడీస్‌యాక్ట్, పోక్సో కేసు, మోసం తదితర కేసులు నమోదు చేశారన్నారు.

అంబేద్కర్ కాలనీలో ఘనంగా బతుకమ్మల నిమజ్జనం



బోథ్ బతుకమ్మ నిమజ్జనంలో పాల్గొన్న మహిళలు



నేరడిగొండలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

బోథ్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి):బోథ్ మండల కేంద్రంలో బతుకమ్మల నిమజ్జన ఉత్సవ కార్యక్రమం ఆదివారం రాత్రి చేపట్టారు. ఈ సందర్భంగా రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతు మహిళలు పట్టణం సమీపంలోని వాగులో బతుకమ్మలను విడిచి పెట్టారు. కాగా అంబేద్కర్ కాలనీ మహిళలు బతుకమ్మ పండుగకు ఆత్మ చైర్మన్ జి.రాజుయాదవ్‌ను ఆహ్వానించగా మైసమ్మ గల్లి మహిళలు ఆ కాలానికి చెందిన మీరు ఇర్షాద్‌అలీని ఆహ్వానించి సాల్వాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు నిర్వహించే బతుకమ్మ పండుగకు భవిష్యత్తులో అండగా ఉంటామని పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఘనంగా బతుకమ్మ

నేరడిగొండ: మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి స్వామి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ యొక్క సాంస్కృతిక స్ఫూర్తిని సూచిస్తుం దని అన్నారు. కళాశాలలో చదివే విద్యార్థినిలు మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యాలు చేసారు.అనంతరం సమీపంలోగల వాగులో నిమజ్జనం చేసారు. ఇందులోఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోయా కొనుగోళ్లపై రైతుల ఆందోళన

» ధర ఖరారులో జాప్యాన్ని నిరసిస్తూ మార్కెట్ కమిటీ కార్యాలయం ముట్టడి
» కార్యదర్శితో వాగ్వాదం, నిలదీత
» టౌన్ సీఐ జోక్యంతో శాంతించిన రైతులు



భైంసాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

భైంసా, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సోయా దిగుబడుల ధరల ఖరారు ప్రక్రియలో జాప్యం, సోయా ధరల తగ్గుదలను నిరసిస్తూ సోమవారం భైంసా వ్యవసాయ మార్కెట్ పరిధిలో రైతులు ఆందోళనలు చేపట్టారు .రెండున్నర గంటల పాటు ధర్నా,రాస్తారోకోలతో రైతులు మార్కెట్ యార్డును హోరెత్తించారు. చివరకు రాత్రి 7 గంటల సమయంలో టౌన్ సీఐ గోపినాథ్ ఘటన స్థలికి చేరుకొని రైతులను సముదాయించి,శాంతిపరచడంతో సమస్య సద్దుమణిగింది.

సాంకేతిక సమస్యతో ధర ఖరారులో మూడు గంటల జాప్యం

ఈ-నామ్ విధానంలో ఇక్కడి మార్కెట్ పరిధిలో వ్యవసాయోత్పత్తుల కొనుగోలు ప్రక్రియ జరుగుతుంది.కొనుగోళ్లు జరిగిన ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఆన్‌లైన్ విధానంలో వ్యవసాయోత్పత్తుల ధరలు ఖరారు అవుతాయి. సోమవారం ఇక్కడి మార్కెట్‌కు మొత్తం 495 మంది రైతులు దిగుబడులను విక్రయించేందుకు గాను తీసుకవచ్చారు.అయితే దిగుబడులు అధికంగా రావడానికి తోడు సాంకేతిక సమస్య తలెత్తడంతో ఆన్‌లైన్ విధానంలో ధర ఖరారుకు జాప్యం ఏర్పడింది. సాయంత్రం 5 గంటల వరకు కూడా ధర ఖరారు కాకపోవడంతో రైతులు విసిగెత్తిపోయి మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యదర్శి కె.పూర్యతో వాగ్వాదానికి దిగారు. జాప్యాన్ని వ్యతిరేకిస్తూ తీవ్రస్థాయిలో ఆగ్రవేశాలు వ్యక్తం చేస్తూ నిలదీసారు. దీంతో కార్యదర్శి కె.పూర్య సంబంధిత సమస్య తీవ్రతను ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ధరల ఖరారును అధికారులు ఆన్‌లైన్ విధానంలో వెల్లడించారు.

ధరల్లో తగ్గుదల నిరసిస్తూ రాస్తారోకో

సాయంత్రం ఐదు గంటల తదుపరి యార్డుకు వచ్చిన వ్యవసాయోత్పత్తుల ధరల్లో సోయా ధరలు తగ్గిపోవడాన్ని నిరసిస్తూ రైతులు మరోమారు ఆందోళనలకు దిగారు. సోమవారం సోయ దిగుబడులకు క్వింటాలుకు కనిష్ట ధర రూ.2,222, గరిష్ట ధర రూ.4,353,మోడల్ ధర రూ.4,148 ఖరారు అయ్యింది. అయితే సంబంధిత ధరలను వ్యతిరేకిస్తూ రైతులు మార్కెట్ కమిటీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. మార్కెట్‌కు అధిక మొత్తంలో సోయా దిగుబడులు రావడం మూలంగా అధికారులు, కొనుగోలు దారులు,కమీషన్ ఏజెంట్లు కుమ్మక్కై ధరలను తగ్గించారని ఆరోపిస్తూ ఆందోళనలు చేపట్టారు. మార్కెట్ కమిటీ గ్రేయిన్ మార్కెట్ యార్డు నుంచి వందకు పైగా మంది రైతులు నిరసన ర్యాలీ నిర్వహించిన ప్రధాన రోడ్డుపైకి తరలివచ్చారు. సంబంధిత సమాచారం అందుకున్న టౌన్ సీఐ గోపినాథ్ పోలీసు సిబ్బందితో కలిసి వచ్చి ఆందోళన స్థలికి తరలి వచ్చారు. రాస్తారోకో చేపట్టిన రైతుల సమస్యలను విని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టారు.ఆందోళనలకు దిగిన రైతులను సముదాయించి శాంతిపరచి రాస్తారోకో విరమించారు.

పట్టుదల, క్రమశిక్షణతో ముందుకు సాగాలి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టుదల క్రమశిక్షణతో ముందుకు సాగాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఆదిలాబాద్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ శిక్షణ తరగతులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథితో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకొన్నారు. ఈ మేరకు గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన మంచిర్యాలలో జరిగే ఉమ్మడి జిల్లా జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపిక పోటీల్లో క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచాలని సూచించారు. క్రీడల్లో రాణించాలంటే శిక్షణ తరగతులను తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సాయి, కబీర్ దాస్ ఉన్నారు.

సంతకాల సేకరణ

బజార్ హత్నూర్ , అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓటు విలువలను ప్రతీ ఒక్కరు కాపాడుకోవాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య అన్నారు. . ఈ కార్యక్రమంలో నాయకులు జల్కె పాండురంగ్, మెస్రం జంగుబాబు, ఇర్ల శివుడు, సూర్యవంశీ పాండురంగ్, సయ్యద్ సల్మాన్, రాజు, రాజాక్ పాల్గొన్నారు.

బోథ్:మండల కేంద్రంలో సోమవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డుగంగారెడ్డి ఆధ్వర్యంలో ఓటు చోరీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటుకు ఉన్న విలువలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులున్నారు.

స్థానిక ఎన్నికల కోసం ఎమ్మెల్యే ఓటర్లను మభ్యపెడుతున్నారు

బోథ్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో స్థానిక శాసనసభ్యులు జాదవ్‌అనిల్ బోథ్ పట్టణ సమస్యలపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పశుల చంటి విమర్శించారు. సోమవారం బోథ్ మార్కెట్‌యార్డులో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇచ్చిన హామీలన్ని గతంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మంత్రి ఇచ్చినవేనని అభివృద్ధి అధికార పార్టీ నాయకుల ద్వారానే జరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పీఏసీఎస్ డైరెక్టర్ ఉమేష్, నాయకులు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, ఆత్మ డైరెక్టర్ రహీముద్దిన్, రాజశేఖర్, పెద్దల అరుణ్‌రెడ్డి, షేక్ షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య

నేరడిగొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందించాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బుగ్గారం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ బోధనలో సాంకేతికను జోడించి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచాలన్నారు. బోధనలో మార్పులు తీసుకురావాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కోరారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం రాథోడ్ సునీత, ఉపాధ్యాయులు వెంకటరమణ, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

పులి జాడ కోసం అడవుల్లోకి అధికారులు

బోథ్, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): బోథ్ రేంజ్ పరిధిలో పులి సంచరిస్తుండడంతో పులి జాడ కోసం సోమవారం అటవీ శాఖ అధికారులు అడవుల్లో వెతుకుతున్నారు.సోనాల మండలంలోని ఘన్‌పూర్ అటవీ ప్రాంతంలో శనివారం పశువుపై పులిదాడి చేయడంతో అటవీశాఖ అధికారులు పులి ఎటువైపు ఉంది అనే విషయం తెలుసుకునేందుకు అడవుల్లోకి వెళ్లారు. పులి పాదముద్రలను గుర్తించడంతో పాటుదాని కోసం చేపట్టాల్సిన రక్షణచర్యలను పరిశీలిస్తున్నారు. పులిదాడిలో హతమైన పశువు సమీపంలో అటవీశాఖ అధికారులు కెమెరాను బిగించారు. కెమెరాలు వచ్చిన ఫుటేజ్‌లను పరిశీలించడంతో పాటు పులి ఎటువైపు వెళ్లే అస్కారం ఉంది అనే విషయాన్ని పరిశీలిస్తున్నారు.ప్రతి సంవత్సరం పులి సంచరిస్తూనే ఉంటుందని అయితే పశువులను వేటాడిన సమయంలోనే పులిసంచరిస్తుందని ప్రజలు అనుకుంటున్నారని అటవీశాఖసిబ్బంది సైతం ఏకీభవిస్తున్నారు.

పులి జాడ కోసం ప్రత్యేక నిపుణులు

పులి సంచారాన్ని నిర్ధారించేందుకు గాను జన్నారం అటవీ శాఖ నుంచి ప్రత్యేక నిపుణులను రప్పిస్తున్నారు. వారు పులి ఎటువైపు వెళ్లింది పులి రక్షన కోసం తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి అనే విషయాన్ని అధికారులకు సూచించనున్నారు.

విద్యుత్ కంచెల భయం

అటవీ సమీప గ్రామాలలో వ్యవసాయం చేస్తున్న రైతులు తమ పంటలను అటవీ జంతువుల నుంచి రక్షించుకునేందుకు విద్యుత్ కంచెలను అమరుస్తున్నారు. అయితే పులి విద్యుత్ కంచెల బారీన పడి చనిపోయే అస్కారం ఉందన్న ఆందోళనను స్థానికులు వ్యక్తపరుస్తున్నారు. పులిని రక్షించడం మన బాధ్యతగా ప్రజలకు వివరించాల్సిందిగా వన్యప్రాణి ప్రేమికులు అంటున్నారు.

రక్తదానంతో నిరుపేదలకు చేయూత

భీంపూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వారిది సామరస్యత చాటే ప్రాణ స్నేహం ఒకరి జన్మదినానికి మరొకరు రక్తదానం చేస్తారు. అత్యవసర చికిత్సలకు కూడా ఎక్కడున్నా సకాలంలో వచ్చి రక్తదానం చేస్తారు. భీంపూర్ మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో జీపీవోగా విధులు నిర్వహిస్తున్న ప్రేంసాగర్, జైనథ్ మండలంలో సబ్‌ఆర్డినేట్ షేక్‌ఇబ్రహీం మంచిస్నేహితులు. ఆసమయంలో అత్యవసరంగా అవసరమున్న వారికి రిమ్స్‌లో రక్తదానం చేస్తారు.

పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

● మండలంలో ఒక్క కొనుగోలు కేంద్రం లేకపోవడం బాధాకరం

భీంపూర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భీంపూర్ మండలం ఏర్పడి కొన్ని ఏళ్లు గడుస్తున్న కూడా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఒక్క కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. మండలంలో మొత్తంగా 33 వేల ఎకరాలలో రైతులు పంటలు పండిస్తున్నారు. పత్తి విక్రయ కేంద్రం జిల్లా కేంద్రం అయిన ఆదిలాబాద్‌లో ఉన్నప్పటికీ అంతర్గత పంటలు అయిన చిరు ధాన్యాల కొనుగోలు కేంద్రాలు మండలంలో ఒక్కటి కూడా లేదు అని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. ఈ ప్రాంతంలో మక్క పండించే రైతులు అధికంగా ఉన్నారు. పీపుల్ కోటి శివారు ప్రాంతంలో ఉన్న స్థలంలో మార్కెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే ఈ పరిసర ప్రాంతాల రైతులకు ఆమోదయోగంగా ఉంటుందని రైతులు అభిప్రాయ పడుతున్నారు. కొత్త మండలం ఏర్పాటు అయిన నుంచి ఒక్క కొనుగోలు కోసం కూడా ఏర్పాటు చేయక పోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నాయకులు, సంబంధిత ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని భీంపూర్ మండలంలో కొనుగోలు పంట కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలవాలని కోరుతున్నారు.

దివ్యాంగుల పరిరక్షణ చట్టం సక్రమంగా అమలు చేయాలి



కుంటాల తహసీల్దార్‌కు వినతి పత్రం అందిజేస్తున్న సయ్యద్ ఖలీం

కుంటాల, అక్టోబరు, 13: (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పరిరక్షణ చ ట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని సామాజిక కార్యకర్త సయ్యద్ ఖలీం అన్నారు. సోమవారం కుంటాల మండలంలో దివ్యాంగులకు జరుగుతున్న అన్యాయంపై ప్రజావాణిలో తహసీల్దార్ కమల్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రం కుంటాల దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థుల కోసం నియమితుడైన సోషల్ ఉపాధ్యాయున్ని జిల్లా ప్రజాపరిషత్ హైస్కూల్‌లో నియమించడం వలన దివ్యాంగ విద్యార్థులకు ఉపాధ్యాయుడు లేకపోవడంతో వారికి నష్టం జరుగుతుందన్నారు. ఈ విషయం సమాచార హక్కు చట్టం 2005 దరఖాస్తు ద్వారా బహిర్గతమైందని ఆయన పేర్కొన్నారు.దివ్యాంగుల పరిరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను సక్రమంగా అమలు చేయాల్సి ఉన్నప్పటికీ అవి కుంటాల మండలంలో బుట్టదాఖలవుతున్నాయని ఆయన దరఖాస్తులో పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో 42 మంది దివ్యాంగ బాలురు, 37 మంది దివ్యాంగ బాలికలు ఉన్నప్ప టికీ అందుకను గుణంగా ఉపాధ్యాయులను కేటాయించడం లేద ని, ఇప్పటికైనా దివ్యాంగుల కోసం కేటాయించిన ఉపాధ్యాయుడిని వారికి కేటా యించాలని, అంతేగా కుండా దివ్యాంగుల చట్టం ప్రకారం మండల విద్యాశాఖా ధికారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రత పౌరుల విధి

● ఆర్జీయూకేటీలో అవగాహన కార్యక్రమం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకురాలు

బాసర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీలో సర్వేజనా ఫౌండేషన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రోడ్డు భద్రత పౌరుల విధి అనే అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆధ్యాపకురాలు శాంతి జగదీష్ మాట్లాడుతూ జీవితం ఎంతో విలువైనది, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారే వాహనాలు నడపాలి, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా వేసువాలని సూచించారు. అలాగే వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపడం ప్రమాదానికి దారితిసస్తుందని ట్రిపుల్‌డ్రైవింగ్ చేయొద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాటు పాటిస్తే మన కుటుంబాలకు మనమే భరోసాగా నిలుస్తామని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోడ్డు భద్రత నియమాలకు కచ్చితంగా పాటిస్తాం అని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ ఆధ్యాపకులు, మూడో సంవత్సరం విద్యార్థులు, ల్యాబ్‌స్టాఫ్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

నేను BOLLI SAMPATH KUMAR S/O BOLLI MAHENDHAR, R/O H.NO. 2-170, NEW VELMAL VILLAGE, SOAN MANDAL, DIST. NIRMAL, T.S.-504105, నాయొక్క పాస్‌పోర్టు నెం V5171767 గల పాస్‌పోర్టు తేది 13.09.2025 రోజున న్యూ వెల్మల్ గ్రామం నుండి సోన్ గ్రామానికి బైక్ మీద ప్రయాణించగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.
Cell: 7732040285

నేటి బీసీ సంఘాల బంద్ 18కి వాయిదా

ఉట్నూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో బీసీ సంఘాలు 14న తలపెట్టిన బంద్ ఈనెల 18కి వాయిదా వేయడం జరిగిందని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి కన్వీనర్ సీపతి లింగాగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఫోనులో మాట్లాడి రాష్ట్రంలో ఉన్న వంద సంఘాలతో చర్చించి జేఏసీగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలిపారన్నారు. ఉట్నూర్ మండల ప్రజలు ఈ నెల 18 శనివారం నాడు వ్యాపార సంస్థలను మూసివేసి బీసీ రిజర్వేషన్ పోరాట సమితి బంద్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు.



17 నుంచి గుస్సాడీ దండారి ఉత్సవాలు

● ఉమ్మడి జిల్లా రాయిసెంటర్ అధ్యక్షుడు దుర్గుపటేల్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు దాదిరావు 7లో..

ఉట్నూర్‌లో పోస్టర్లు ఆవిష్కరించిన ఆదివాసీ నాయకులు



జిల్లాలో విష జ్వరాలు
తగ్గుముఖం

● రాథోడ్ జైసింగ్, రిమ్స్ డైరెక్టర్, ఆదిలాబాద్

ప్రశ్న: ప్రస్తుతం రిమ్స్ ఆసుపత్రిలో ఓపీ ఎలా ఉంటుంది?

జవాబు: గత రెండు మాసాలతో పోల్చుకుంటే ప్రస్తుతం విషజ్వరాల తీవ్రత కొంత తగ్గుముఖం పట్టింది. గతంలో నిత్యం 2800 వరకు రోగులు రిమ్స్ ఆసుపత్రికి వచ్చే వారు. ప్రస్తుతం 2400లకు పడిపోయింది.

ప్ర: రిమ్స్ సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రిలో సరిపడా వైద్యులు అందుబాటులో ఉన్నారా?

జ: ప్రస్తుతం వైద్యుల కొరత లేదు. కార్డియాలజి వైద్య సేవలు తప్ప అన్ని రకాల వైద్య సేవలను అందిస్తున్నాం.

ప్ర: సూపర్‌స్పెషాలిటి ఆసుపత్రిలో కొత్తగా ఎలాంటి వైద్య సేవలను అందిస్తున్నారు?

జ: రిమ్స్‌లో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలను అందిస్తున్నాం. ముఖ్యంగా యూరాలజి, పీడియాట్రిక్ సర్జరీ, ప్లాస్టిక్ సర్జరి, మెడికల్ గ్యాస్ట్రో, న్యూరోసర్జరీ లాంటి సేవలను రిమ్స్‌లోనే అందిస్తున్నాం.

ప్ర: పారిశుధ్య నిర్వాహణపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారా?

జ: పారిశుధ్య నిర్వహణపై సీరియస్‌గా దృష్టి సారిస్తున్నాం. ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా రోగులు వారి బంధువులకు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నాం. అంతేకాకుండా జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తున్నాం.

ప్ర: ఎప్పటి నుంచి క్రిటికల్ కేర్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తారు?

జ: రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో రూ.23కోట్ల నిధులతో చేపట్టిన క్రిటికల్ కేర్ భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ప్రారంభించి అత్యవసర సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.

- ఆదిలాబాద్, ఆంధ్రజ్యోతి



● సోయా, పత్తి పంటలను ఆరబోసిన రైతులు

'మద్దతు'... దక్కేనా?

- జిల్లాలో చేతికొచ్చిన పత్తి, సోయా
- ఇంకా ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- కొనుగోళ్లపై ఈనెల 15వ తేదీన అఖిలపక్ష సమావేశం
- ఇప్పటికీ పూర్తికాని పంటల సాగు లెక్కలు
- అత్యవసరాల పేరిట పంట దిగుబడులను అమ్మేసుకుంటున్న రైతులు
- మద్దతు ధరకు పంటను అమ్ముకునేందుకు అన్నదాతకు తప్పని ఎదురుచూపులు

జిల్లాలో పత్తి, సోయా.. పంటలను ప్రధానంగా సాగు చేస్తారు. పూర్తిగా వర్షాధారంగా పండించే పంట దిగుబడు లు ఈయేడు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. ఈ యేడు 4లక్షల 31వేల ఎకరాల్లో పత్తి, 82వేల ఎకరాల్లో సోయ పంట సాగైంది. అంతే కాకుండా పత్తి క్వింటాల్ మద్దతు ధర రూ.8110 కాగా సోయా మద్దతు ధర రూ.5328గా ప్రభుత్వం నిర్ణయించింది. మునుపెన్నడూ లేని విధంగా ఈయేడు కురిసిన అధిక వర్షాలతో పంట దిగుబడులపై ప్రభావం పడుతోంది.

ఆదిలాబాద్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధికారుల అంచనాల ప్రకారం పత్తి 30లక్షల క్వింటాళ్లు, సోయా 4లక్షల క్వింటాళ్ల దిగుబడులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. అయితే పంటచేతికి వచ్చి పక్షంరోజులు గడుస్తున్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులు ఊసెత్తడం లేదు. జిల్లాలో అడపాదడపగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. పంటను నూర్పిడి చేసి ఆరబెట్టిన ఎక్కడ వర్షానికి తడిసి పోతుందోనన్న భయం రైతులను వెంటాడుతుంది. కొనుగోళ్ల మరింత ఆలస్యమైతే రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం కనిపిస్తుంది. అంతేకాకుండా చేతికి వచ్చిన పంటలను నిలువ చేసుకునే పరిస్థితి లేక రైతులు ఆదరబాదరగా అమ్మేసుకుంటు నష్టపోతున్నారు.

ప్రతీసారి నిర్లక్ష్యమే..

పంటల కొనుగోళ్లపై ప్రతీసారి నిర్లక్ష్యమే కనిపిస్తుంది. అధికారులకు ముందుచూపు లేకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రోజుల తరబడి పంటలను ఆరబోస్తూ కుప్పలు చేస్తూ పడరాని పాట్లు పడుతున్నారు. దసరా పండుగ తర్వాత పంటలను కొనుగోలు చేస్తామని ప్రకటించినా.. ఇప్పటి వరకు ఆ దిశగా ఏర్పాట్లు చేయడం లేదు. దీంతో కొనుగోళ్లు మరింత ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తుంది. ఈ నెల 20 తర్వాత పంటల కొనుగోళ్లకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఇన్నాళ్లు సీసీఐ, జిన్నింగ్ వ్యాపారుల మధ్య తలెత్తిన వివాదంతో కొనుగోలు ప్రక్రియ ఆలస్యమవుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే పత్తిపంటను కొనుగోలు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించిన సోయా కొనుగోళ్లపై మాత్రం ఎలాంటి ఆదేశాలు లేవంటున్నారు. ప్రతీసారి మార్క్‌ఫెడ్, మార్కెటింగ్, సీసీఐ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అన్నదాతలకు ఎదురు చూపులు తప్పడం లేదు.

> **రేపు స్పష్టత వచ్చే అవకాశం ఉంది**
>
> **: గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఆదిలాబాద్**
>
> 
>
> పత్తి, సోయా కొనుగోళ్లపై ఈనెల 15న స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అఖిల పక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుంది. అందరితో చర్చించిన తర్వాత కొనుగోళ్లపై ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేవు. రైతులు ప్రభుత్వ కొనుగోళు కేంద్రాలలోనే పంటను విక్రయించి మద్దతు ధరను పొందాలి.



జిల్లా మార్కెటింగ్ కార్యాలయం

నత్తనడకన క్రాప్‌బుకింగ్

జిల్లాలో జూన్, జూలై మాసాలలోనే పంటల సాగు పూర్తవుతుంది. అయినా ఇప్పటి వరకు క్రాప్ బుకింగ్ పూర్తికాకపోవడంపై అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది. నాలుగు మాసాలు గడిచి పోతున్న పంటల సాగు లెక్కలను తేల్చడం లేదు. దీంతో పంటల కొనుగోళ్లకు ఆటంకంగా మారుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సాగు లెక్కల ఆధారంగానే పంటలను కొనుగోలు చేసే అస్కారం ఉంటుంది. ఇన్నాళ్లు అధిక వర్షాల పేరిట క్షేత్రస్థాయిలోకి వెళ్లకుండానే పంటల సాగు లెక్కలను నమోదు చేశారన్న ఆరోపణలు వస్తున్నాయి. దసరా పండుగ ముగిసి దీపావళి పండుగ దగ్గర పడుతున్నా.. కొనుగోళ్లపై ఇంకా సందిగ్ధమే కనిపిస్తుంది. ఈ నెల15న కలెక్టర్ అఖిలపక్ష సమావేశాన్ని

(తరువాయి 6వ పేజీలో....)



ఇంద్రవెల్లిలోని మార్కెట్‌లో ప్రమిదలను కొనుగోలు చేస్తున్న మహిళలు

సంతలో దీపావళి సందడి

ఇంద్రవెల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన వారసంతలో దీపావళి సందడి వాతావరణం నెలకొంది. దీపావళి సమీపించడంతో వారసంతకు వచ్చిన జనం వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన దుకాణాలలో దీపారాధన కోసం వివిధ రకాల ప్రమిదలు, ముగ్గుల రంగులు, పూజా సామగ్రిని కొనుగోలు చేసి తీసుకెళ్లారు. దీపావళికి ముందువచ్చే వారం సంత ఇదే కావడంతో ఇంద్రవెల్లి మండలంతో పాటు ఆదిలాబాద్ రూరల్, గుడిహత్నూర్, సిరికొండ, ఉట్నూర్ మండలాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చారు. దీంతో వారసంతతో దీపావళి సందడి వాతావరణం నెలకొంది.

'భవిత'కు దరఖాస్తులు

భీంపూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలం పిప్పల్కోటి పాఠశాలలో భవిత కేంద్రంలో వలంటీర్‌గా పని చేయడానికి ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈనెల 15లోగా మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు విలాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, ఆధార్ ఇతర అవసరమైన ధ్రువపత్రాలు జత చేయాలని సూచించారు. ఎంపికైన వలంటీర్‌కు రూ. 3,250 చెల్లిస్తారని ఆయన వివరించారు.

రాజీనామాపై భూపెల్లి వెనక్కి

మావల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి చేసిన రాజీనామాను వెనక్కి తీసుకున్నారు. పార్టీ నాయకుల సూచన మేరకు ఏఐసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో సమావేశం అయ్యారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో అవకాశాలు కల్పిస్తామని, ఏళ్లుగా పని చేస్తున్న కార్యకర్తలకు ప్రాధాన్యం కల్పిస్తామనడంతో రాజీనామాను వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఆదివాసీలకు మహనీయులే ఆదర్శం

● ఎమ్మెల్యే బొజ్జుపటేల్

ఉట్నూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరు సల్పి అమరులైన కొమురంభీం, కుమ్రసూరులు ఆదివాసీలకు ఆదర్శమని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. సోమవారం మండలంలో ఆయన పర్యటించి దొంగచింత గ్రామంలో కొమురంభీం, కుమ్రసూరు వర్ధంతి కార్యక్రమాలకు హాజరు అయ్యారు. ముందుగా జెండా వద్ద ఆదివాసీ గిరిజనుల సంప్రదాయ పద్ధతుల్లో జెండా పూజలు నిర్వహించిన అనంతరం ఆదివాసీ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కంటే ముందే ఆదివాసీ గిరిజనుల హక్కుల కోసం పోరాటాలు చేసిన మహనీయులు కొమురంభీం, కుమ్రసూరులు అన్నారు. వారి అడుగు జాడల్లో నడుస్తూ ఆదివాసులు హక్కులు సాధించుకోవాలని అన్నారు.



దొంగచింతలో భీం, సూరు విగ్రహాల వద్ద నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

మండలంలోని కామాయిపేట గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్‌ను గ్రామ గిరిజనులు గ్రామ పోలిమెర నుంచి ఊరి మధ్య వరకు ఆదివాసీ గిరిజన సాంప్రదాయ వాయిద్యాల మధ్య స్వాగతం పలికి ఊరేగించారు. గ్రామ పోలిమెర నుంచి గ్రామ రెడిబొడ్డు వరకు వాయిద్యాల చప్పుల్ల మధ్య నడిచిన ఎమ్మెల్యే గ్రామ సమస్యల పరిష్కారానికి అన్ని వేళలా ముందు ఉంటానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆదివాసీ పీవీటీజీ గిరిజనులకు సైతం ఇందిరమ్మ ఇళ్ల 140 మంజూరు చేయడం జరిగిందని అన్నారు. లబ్ధిదారులు స్వయంగా ఇండక్లౌ పనులు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ కాంట్రాక్టర్లు పనులు చేపడితే నాసిరకంగా జరగకుండా నాణ్యతగా యజమాలు జరుపుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా ఒక 40 మంది పీవీటీది గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ఒక ఇంటి పనులకు పూజలు చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాంప్రసాద్, ఎంపీవో సుధీర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జైవంతురావు, ఆర్టీఏ సభ్యులు దూట రాజేశ్వర్, ఆత్రం రాహుల్, జగదీష్‌జాదవ్, రాజేశ్ నాయక్, భీమ్రావు, మరసుకోల తిరుపతి, దాసండ్ల ప్రభాకర్, రాధాబాయి, బాలేరావు, తదితరులు పాల్గొన్నారు.

మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

తాంసి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఎన్ని మారినా మాలీ కులస్థుల బతుకులు మారడం లేదని సంఘం కుల పెద్దలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాలి సంఘం జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు కుల పెద్దలు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో తమ కులస్తులు అధిక శాతం ఉన్నప్పటికీ ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మాలీలను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఆశన్న, ఇస్తారీ, దేవరావు, ప్రేమల, అశోక్, చౌదరి గంగారాం, గోవింద్, తదితరులు ఉన్నారు.

72 గంటల నిరసన దీక్ష ప్రారంభం

ఉట్నూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, దినసరి ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం 72గంటల నిరసన దీక్ష ప్రారంభించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలలో గత కొన్నేళ్లుగా పని చేస్తున్న 410 మంది ఉద్యోగుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, అర్హులైన దినసరి ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలని డిమాండ్ చేశారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఫిర్యాదుల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి విభాగంలో వచ్చే వినతుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన వాటిని పరిష్కరించేలా చూడాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతుల రూపంలో అందించగా... వాటి పరిష్కారనికి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు విస్తృత సూచనలు చేశారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ... ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో 121 దరఖాస్తులను స్వీకరించడం జరిగిందన్నారు. ఇందులో అదనపు కలెక్టర్లు శ్యామలా దేవి, రాజేశ్వర్, ట్రైనీ కలెక్టర్ సలోని చబ్రా ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వంశీ కృష్ణ రెడ్డి, ఆర్‌డీవో స్రవంతి, తదితరులు పాల్గొన్నారు. కాగా, హిందూ దేవతల చిత్రాలు ఉండే టపాసులు రాకుండా చర్యలు తీసుకోవాలని డాక్టర్ హెచ్‌వీ వీఏజడ్‌ఈ సేవా సమితి అధ్యక్షుడు ప్రఫుల్ వజే కలెక్టర్‌ను కోరారు.

గిరిజన అర్జీలను త్వరగా పరిష్కరించాలి

ఉట్నూర్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం గిరిజన దర్బారులో ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సమర్పిస్తున్న అర్జీలను సత్వరమే పరిష్కరించి గిరిజనులకు న్యాయం చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆర్జీల్ అన్నింటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం ఈనెల 17న నుంచి గుడిరేవులో గల ఆదివాసీల ఆరాధ్య దైవం పద్మల్‌పూరికాకో ఏత్మాసార్ ఆలయం ప్రాంగణంలో జరుగనున్న గుస్సాడి, దండారి, దర్బార్ ఉత్సవాలు సంబంధించిన గోడప్రతులు, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఇందులో ఇన్‌చార్జీ ఏపీఓ జనరల్ దామోదర స్వామి, ఏడీఎంహెచ్‌ఓ డాక్టర్ కుడిమెత మనోహర్, తదితరులున్నారు.

సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలి

ఆదిలాబాద్ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సీపీఆర్‌పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ సర్వరాజ్ తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీపీఆర్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. డాక్టర్ ఆశా కిరణ్, సూపర్‌వైజర్ మేరీ, హెల్త్ అసిస్టెంట్ ప్రేమ్‌సింగ్ పవర్, తదితరులున్నారు.

తెగువకు సత్కారం

● దారి దోపిడీ దొంగలను వెంబడించిన యువకుడికి ఆదిలాబాద్ డీఎస్పీ సన్మానం

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల ఏడవ తేదీన ఆదిలాబాద్ పట్టణానికి చెందిన బాధితుడు వికాస్ మోజే స్థానిక వ్యాపారి వద్ద గుమస్తాగా పని చేస్తూ ఇచ్చోడ పట్టణానికి వెళ్లి అక్కడ నుంచి డబ్బులను తీసుకొనివచ్చే క్రమంలో దారి దోపిడీ జరిగింది. ఆదిలాబాద్ శివారులోని దేవాపూర్ చెక్‌పోస్టు దాటిన వెంటనే అతనిని పట్టుకొని దాడి చేసి అతని వద్ద ఉన్న దాదాపు రూ.4,15,000ను తీసుకొని పారిపోయారు. ఇదే క్రమంలో బాధితుడు వెంటనే గ్రహించి వారిని ఎలాగైనా పట్టుకోవాలన్న ఉద్దేశంతో పారిపోతున్న నిందితులను ప్రాణాలకు తెగించి అత్యంత వేగంతో వాహనాన్ని నడిపి వారి వాహనం, ముఖచిత్రాలు కనబడేలా వీడియోను చిత్రీకరించారు. ఈ సాక్షాలతో నిందితులు ముగ్గురు జాదవ్ అంకుష్, ముండే సచ్చిదానంద్, కేంద్ర శంకర్ లను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. నిందితులు పారిపోయే క్రమంలో బాధితున్ని తన్నే ప్రయత్నం చేసినా.. ప్రాణాలకు తెగించి వారిని పట్టుకునేందుకు ప్రయత్నించిన వికాస్ ను డీఎస్పీ జీవన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. ఘటన జరిగిన వెంటనే డయల్ డయల్ 100కు కాల్ చేయడం ద్వారా మావల సీఐతో కలిసి కేసు దర్యాప్తు ప్రారంభించడం జరిగిందన్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 24 గంటల్లో నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు. వారి వద్ద నుంచి రూ.4,50,000 నగదు, మూడు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకొన్నట్లు పేర్కొన్నారు. బాధితుడు తన ప్రాణాలకు తెగించి నిందితుల ముఖచిత్రాలు కనబడేలా ఆధారాలను సేకరించి పోలీసులకు అందజేయడంతో ఎస్పీ అఖిల్ మహాజన్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారన్నారు.



వికాస్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ జీవన్ రెడ్డి

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ఆదిలాబాద్ టౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ వారు అన్ని రంగాల్లో రాణించేలా ప్రైవేట్ పాటశాలల యాజమాన్యాలు కృషి చేస్తున్నాయని ట్రస్మా ప్రధాన కార్యదర్శి వకుళాభరణం ఆదినాథ్ అన్నారు. సోమవారం ఇందిరా ప్రియదర్శిని మైదానంలో ఎంఎస్‌కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 2025 పోటీలను నిర్వహించారు. ట్రస్మా జిల్లా అధ్యక్షులు రంగినేని పవన్ రావు తో కలిసి పోటీలను ప్రారంభించారు. కోశాధికారి దేవేందర్ పటాస్కర్, గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థ సారథి, పెట సంఘం కార్యదర్శి సాయి, నిర్వాహకులు మజర్, దీపక్, తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి